కర్రీస్ పాయింట్లు @ పల్లెలు

• జిల్లాలో విస్తరిస్తున్న కొత్త సంస్కృతి

సీతారామపురం: అమ్మా...అక్కా బావ వచ్చారు...ఏం కూర చేద్దాం.. పక్కవీధిలో కర్రీస్ పాయింట్‌లో ఒక సాంబారు ఒక వేపుడు కూరలు పెరుగు ప్యాకెట్ కొనుక్కుని వచ్చేయ్..అందరికీ సరిపోతాయ్..ఏమండీ..నువ్వు వచ్చేటప్పుడు మధ్యాహ్నానికి ఒక పప్పు, బెండకాయ వేపుడు తీసుకురండి..అన్నం పెట్టేస్తా..ఈ మాటలు ఇప్పుడు గ్రామాల్లో వినిపిస్తున్నాయి. ఒకప్పుడు పట్టణానికే పరిమితమైన కర్రీస్ పాయింట్లు ఇప్పుడు పల్లెలకూ పాకాయి. గ్రామాల్లోనూ వండిన కూరలు దొరుకుతున్నాయి. వీటి వలన కొందరికి ఉపాధి దొరుకుతుంటే మరికొందరిని అవసరానికి ఆదుకుంటున్నాయి. గతంలో మండల కేంద్రాల్లో చిన్నచిన్న హోటళ్లు ఉండగా, ఇప్పుడు కర్రీస్ పాయింట్లు ఏర్పాటవుతున్నాయి. వీటిపై ఆధారపడి చాలామంది మహిళలు సొంతూరిలోనే స్వయం ఉపాధి పొందుతున్నారు. సాధారణంగా గ్రామాల్లో ఉదయం అల్పాహారాలు వంటివి ఎవరిళ్లలో వారే చేసుకునే వారు. టీ కూడా ఇంట్లోనే తాగేవారు. అలాంటిది ఇప్పుడు పల్లెల్లోనూ అల్పాహార, టీ దుకాణాలు వెలిశాయి. తాజాగా కర్రీపాయింట్లు కూడా వెలుస్తున్నాయి. అంటే చివరకు మధ్యాహ్నం కూరలు కూడా వండుకోవడం లేదని అర్థమవుతోంది. ఇందుకు కొన్ని కారణాలున్నాయి. కూలి పనులకు వెళ్లేవారికి సమయం లేకపోవడం, పనులు చేసి వచ్చి వండుకోవాలంటే కష్టంతో కూడుకున్న పని కావడం..ఇలాంటి వారికి ఈ కర్రీస్ పాయింట్లు అండగా ఉంటున్నాయి. మరోవైపు కూరగాయల ధరలు కూడా పెరగడం ఒక కారణంగా చెప్పుకోవచ్చు.



సీతారామపురంలో వెలిసిన కర్రీస్ పాయింట్


కర్రీస్ ప్యాక్ చేస్తున్న నిర్వాహకురాలు

ఒంటరి వారిని ఆదుకుంటున్నాయి

ఒకప్పుడు గ్రామాల్లో ఇళ్లకు బంధువులు సొంతంగా వండి వార్చేవారు. నేడు పల్లెల్లో కూడా ఇంటికొచ్చిన వారికి సొంతంగా కూరలు తయారుచేసి పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఇళ్లకు బంధువులు వస్తే వెంటనే కర్రీస్ పాయింటే గుర్తుకొస్తుంది. సమయం లేక కొందరు, పిల్లలు విదేశాల్లో ఉండడంతో వద్దులు వయోభారంతో.. చదువు నిమిత్తం పిల్లలు ఎక్కడో ఉండి ఒంటరిగా ఉండే తల్లిదండ్రులు, ఇలా పట్టణ ప్రజలతో పాటు పల్లెవాసులు కూడా నేడు కర్రీస్ పాయింట్ల వద్ద క్యూ కడుతున్నారు. దీంతో పల్లెల్లో స్వయం ఉపాధి పొందడానికి కర్రీస్ పాయింట్లు మంచి అవకాశంగా మారాయి.

ఆరుగురికి ఉపాధి



మొదట్లో భోజనాలతో పాటు కొద్దిగా కూరల ప్యాకెట్లు తయారుచేసి అమ్మేవాళ్లం. ఇప్పుడు జనాలు ఎక్కువగా కూరలు కావాలని అడుగుతున్నారు. దీంతో పనివాళ్లను కూడా పెట్టుకుని తయారు చేస్తున్నాం. మొదట్లో ప్యాకెట్ రూ.10కి విక్రయించేవాళ్లం. ఇప్పుడు కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వలన రూ.20కు పెంచాం. సీతారామపురం చుట్టుపక్కల పల్లెల వారు వచ్చి కర్రీస్ తీసుకెళ్తున్నారు.

– గురులక్ష్మి, సీతారామపురం

కూరలు కొనే వారు పెరిగారు



మొదట్లో భోజనాలు మాత్రమే చేసేదాన్ని. ఇప్పుడు కూరలు కావాలని అడుగుతుండడంతో ప్యాకెట్లు కట్టి ఇవ్వడం మొదలుపెట్టా. మొదట్లో కొద్దిమంది మాత్రమే వచ్చేవారు. ఇప్పుడు సీతారామపురం చుట్టుపక్కల గ్రామాల వారు వచ్చి కూరలు తీసుకెళుతున్నారు. అదే శ్రమ ఎక్కువ ఆదాయం వస్తోంది. సొంతూరిలోనే ఉంటూ ఉపాధి పొందడంతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నా.

– ధనమ్మ, సీతారామపురం

కూరగాయలు కొనలేక



మా ఇంట్లో ముగ్గురం ఉంటున్నాం. రెండు రకాల కూరగాయలు కేజీ కొనాలంటే రూ.100 వరకు ఖర్చవుతుంది. దీనికన్నా మూడు కూరలు తెచ్చుకుంటే రూ.60 మాత్రమే అవుతుండడంతో కర్రీస్ పాయింట్‌కు వస్తున్నాం.

– నీలవేణి, సీతారామపురం

నిర్బంధించి పనులు చేయిస్తున్నారు

• మత్స్యకారుడి ఆవేదన

సోమశిల: నిషేధిత అలివి వలలతో సోమశిల జలాశయ పైతట్టు ప్రాంతాల్లో తమచేత నిర్బంధంగా వేట చేయిస్తున్నారని ఓ మత్స్యకారుడు తెలిపాడు. గురువారం అతను జలాశయం వద్ద విలేకరులకు విషయాన్ని చెప్పాడు. అన్నమయ్య జిల్లా ఎగువ ప్రాంతంలో అలివి వలలతో వేట సాగించేందుకు తమను విజయవాడ నుంచి తీసుకొచ్చారని, తనతోపాటు మరికొందరిని నిర్బంధించి పనిచేయిస్తున్నారని వాపోయాడు. అనారోగ్యంతో బాధపడుతున్నా పనిచేయాలని ఒత్తిడి చేయడంతో తప్పించుకుని సోమశిలకు వచ్చానని పేర్కొన్నాడు. టీడీపీ బడా నాయకులు సోమశిల జలాశయం ఎగువ ప్రాంతంలో విచ్చలవిడిగా మత్స్యకారులతో నిర్బంధ వేట చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



కలిగిరి: కలిగిరి–కొండాపురం రోడ్డులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..వింజమూరు మండలం నేరేడుపల్లికి చెందిన కండే మనోహర్ మోటార్‌సైకిల్‌పై కొండాపురం నుంచి కలిగిరికి వస్తున్నాడు. ఈ క్రమంలో కలిగిరి సమీపంలో కృష్ణారెడ్డిపాళేనికి కర్రల లోడు వెళ్తున్న ట్రాక్టర్ అడ్డురావడంతో మార్జిన్ దిగి మళ్లీ రోడ్డుపైకి వచ్చే క్రమంలో ట్రాక్టర్ ట్రక్కులోని కర్ర మనోహర్ గొంతులో గుచ్చుకుంది. స్థానికులు కలిగిరిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. కలిగిరి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

క్లుప్తంగా

రక్తదాన శిబిరం



కొండాపురం: ఇస్కపాళెంలో దామా మస్తానయ్య ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు దామా శివబాబు గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కావలి రెడ్‌క్రాస్ సహకారంతో కాకర్ల సురేష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 70 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

వెంగమాంబకు పల్లకిసేవ



దుత్తలూరు: నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో వెంగమాంబ దంపతులకు గురువారం పల్లకిసేవ జరిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

పంచాయతీ రుసుం వసూలు హక్కు రద్దు

ఉదయగిరి: ఇటీవల నిర్వహించిన వేలంలో ఉదయగిరి మేజర్ పంచాయతీ పరిధిలో రోజువారీ రుసుం వసూలు హక్కును షేక్ ఖాలీద్ అనే వ్యక్తి దక్కించుకున్నారని, అందుకు సంబంధించి పంచాయతీకి చెల్లించాల్సిన రూ.10.12లక్షల నగదు మొత్తాన్ని నిర్ణీత గడువులోగా చెల్లించకపోవడంతో హక్కును రద్దు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి కరీముల్లా తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ ముర్తుజాతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖాలీద్‌కు నోటీసులు పంపినా స్పందించకపోవడంతో రద్దు చేశామని చెప్పారు. ఆ తరువాత స్థానంలో ఉన్న సంధానికి మూడ్రోజుల్లోగా వేలానికి సంబంధించిన సగం మొత్తాన్ని చెల్లించాలని నోటీసులు పంపామన్నారు. నిబంధనల మేరకు నగదు చెల్లిస్తే సంధానికి హక్కును ఖరారు చేస్తామని తెలిపారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 1వ వార్డుకు చెందిన గడ్డం రమేష్, 4వ వార్డుకు చెందిన తంగెళ్ల రామ్మోహన్‌రాజు, 9వ వార్డుకు చెందిన ఇంటూరు శ్రీనివాసులు, 14వ వార్డుకు చెందిన వంటేరు వెంకటసుబ్బయ్య, పఠాన్ దిల్షాద్, 19వ వార్డుకు చెందిన షేక్ సాధిక్ ఇటీవల మృతి చెందారు. వారి అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి రూ.10వేలు చొప్పున నగదు అందజేశారు. కుడుముల సుధాకర్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరుగు పోటీల్లో సాగరం విద్యార్థిని సత్తా



సోమశిల: అనంతసాగరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని షేక్ మహీన్ శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి 80 మీటర్ల పరుగు పోటీలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం బట్టేడ్డి లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

ఎన్‌జీ రంగాకు నివాళి



ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ఆచార్య ఎన్‌జీ రంగా జయంతిని గురువారం నిర్వహించారు. ఎన్‌జీ రంగా చిత్రపటానికి అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



వరికుంటపాడు : మండలంలోని గణేశ్వరపురంలో ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జి తాతిపూడి డేవిడ్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్‌మాదిగ గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు బకీరు జాషువామాదిగ, బెజవాడ బాలగురవయ్య మాదిగ, గోచిపాతల ఆనందరావు మాదిగ, కాకి అంకయ్య మాదిగ, ఆంకి ఏసు రత్నం మాదిగ, నాగయ్యమాదిగ పాల్గొన్నారు.

లోకేశ్ రెడ్‌బుక్‌కు భయపడం

• కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'లోకేశ్ రెడ్‌బుక్‌కు భయపడం. ఎంతో ఓర్పుతో ఉన్నా ఎల్లో మీడియా, సోషల్ మీడియాలో విషపూరితమైన రాతలు రాస్తున్నారు. ముందు అభివృద్ధి పనులు చేయాలి.. అని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కావలిలో విలేకరులతో మాట్లాడారు. మా పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టినా, జైలుకు పంపించినా భయపడరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. సూపర్ సిక్స్ అని చెప్పి అధికారంలోకి వచ్చి, వాటిని అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరల్చడానికి వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు పెడుతున్నారన్నారు. నాలుగు నెలల్లోనే ప్రజలకు అన్ని అర్థమవుతున్నాయన్నారు. లా అండ్ ఆర్డర్ చంద్రబాబు దగ్గరే ఉందని, రాష్ట్రంలో అది బాగా లేదని పవన్ కళ్యాణ్ చెబుతున్నారంటే టీడీపీ పనితీరు ఏమిటో అర్థం చేసుకోవచ్చన్నారు. 2019 నుంచి 2024 వరకు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 128 ఎకరాల ప్రభుత్వ భూమి, కాలువలు, గుంటలు కబ్జాలు చేసి లేఅవుట్లు వేసి అమ్మకాలు చేసినట్లు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారం నుంచి బయటపడేందుకు చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్, బెంగళూరులో ఉన్న బీజేపీ నాయకులు, జనసేనలో చేరిన బాలినేని శ్రీనివాసరెడ్డితో రూ.100 కోట్లతో డీల్ కుదుర్చుకున్నట్లు విష ప్రచారం చేస్తున్నారన్నారు. కబ్జా వివరాలు తనకు తెలియదని,అవన్నీ రెవెన్యూ శాఖ చూసుకుంటుందని చెబుతున్న మున్సిపల్ కమిషనర్ 128 ఎకరాలు కబ్జా అయినట్లుగా స్టేట్‌మెంట్ ఎలా ఇచ్చారని అడిగితే సమాధానం చెప్పడం లేదన్నారు. ప్రభుత్వ భూములను ఏ పార్టీకి చెందిన వారైనా కబ్జా చేస్తే అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, చిరు వ్యాపారులు కొనుగోలు చేసిన ఇంటి స్థలాలను వివాదం చేసి వారిని బాధ పెట్టడం దుర్మార్గమన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించామని గుర్తు చేశారు. ఇప్పుడు మీరు అధికారంలో ఉన్నారని, కావలి ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులు, దగదర్తి విమానాశ్రయం, తుమ్మలపెంట రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. జలవనరుల శాఖ మంత్రి వస్తే సంగం బ్యారేజ్ వద్ద కావలి కాలువకు బైపాస్ కెనాల్ నిర్మాణం చేపట్టాలని, కావలి పెద్ద చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోరలేదని గుర్తుచేశారు.. ఇప్పటికైనా బురదజల్లే కార్యక్రమాలను ఆపేసి ప్రజలకు మంచిచేసే పనులు చేపట్టాలని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డికి హితవు పలికారు.రామిరెడ్డి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, పందిటి కామరాజు, కుందుర్తి కామయ్య, గుడ్లూరు మాల్యాద్రి, వేగూరి చిన్న పుల్లయ్య, మండలి కృష్ణారావు, గుర్రం వెంకటేశ్వర్లు, పుల్లా శ్రీనివాసులురెడ్డి, ద్రోణాదుల వెంకట్రావు, షేక్ నాయబ్‌రసూల్, కలికి శ్రీనివాసులరెడ్డి, పూనూరు అమర్‌నాథ్‌రెడ్డి, అమరా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల నడుమ అంతర్యుద్ధం

• సాగునీటి పైపులైన్ తొలగింపు


జేసీబీతో పైపులైన్ తొలగిస్తుండగా అడ్డుపడుతున్న ఆదిలక్ష్మమ్మ

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం తూర్పుకంభంపాడులో తెలుగు తమ్ముళ్ల మధ్య నెలకొన్న అంతర్యుద్ధం కొందరి పొలాలకు దారి లేకుండా చేసింది.మరికొందరి పొలాలకు సాగునీరు లేకుండా చేసింది. వివరాలు..టీకేపాడులో టీడీపీకి చెందిన సుమారు 15 మంది రైతులకు సాగునీటి కాలువ ఉంది. ఈ కాలువ మీదుగానే వారు పొలాల్లోకి రాకపోకలు సాగించేవారురు. ఈ కాలువను టీడీపీకి చెందిన రామయ్య అనే వ్యక్తి తన భూమిలో కలిపేసుకోవడంతో సాగునీటితో పాటు దారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సదరు రైతులు మూడేళ్ల క్రితం ఆదిలక్ష్మమ్మ పొలం మీదుగా పైపులైన్ ఏర్పాటు చేసుకున్నారు. ఆమె పొలం మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఆదిలక్ష్మమ్మ అసలు దారి వదిలేసి తన పొలం మీదుగా రాకపోకలు సాగించడం సరికాదని రైతులతో అంటుండేది. ఈ నేపథ్యంలో వాళ్లల్లో వారికే పడక సాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపులైన్‌ను బుధవారం జేసీబీతో తొలగించారు. ఆదిలక్ష్మమ్మ తన పొలానికి సాగునీరు నిలిచిపోతుందన్న భయంతో పైపులైన్ తొలగించవద్దంటూ జేసీబీకి అడ్డుపడినా వినకుండా తొలగించేశారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా రామయ్య చేసిన ఆక్రమణలను తొలగిస్తే రైతుల సమస్య తీరుతుంది. ఆ దిశగా ఆలోచించకుండా కొందరు పైపులైన్‌ను తొలగించడం ఏమిటంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. కాగా కాలువను ఆక్రమించిన రామయ్య అదే గ్రామానికి చెందిన తలపల బుజ్జమ్మ అనే గిరిజన మహిళకు ప్రభుత్వం మంజూరు చేసిన 80 సెంట్లకుపైగా భూమిని కూడా తన పొలంలో కలుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బాధిత మహిళ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా న్యాయం జరగలేదని ఇప్పటికీ వాపోతుంది. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సాగునీటి కాలువతో పాటు గిరిజన మహిళ భూమి ఆక్రమణల సమస్యను పరిశీలించాలని న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి


కలిగిరి: నిమ్మ మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్

జలదంకి/కలిగిరి: ఉపాధి కూలీల సంఖ్యతో పాటు పనిదినాలను పెంచాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జలదంకి, కలిగిరి మండలాల్లో పర్యటించారు. తొలుత కలిగిరి మండలం వెలగపాడు పంచాయతీలో ఉపాధి కింద చేపడుతున్న మినీ గోకులాలు, ఉద్యాన తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. శ్రీకొలను సబ్‌కెనాల్ నిర్మాణం వల్ల చెరువులకు సక్రమంగా నీరు అందడం లేదని, సక్రమంగా అందేలా చూడాలని కలెక్టర్‌ను రైతులు కోరారు. అనంతరం జలదంకి మండలం తొమ్మిదో మైలులో సీసీరోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. జలదంకి ఉన్నత పాఠశాలలో నాడు–నేడు ద్వారా చేపట్టిన అదనపు తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు అపార్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. డ్వామా పీడీ గంగాభవాని, కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, తహసీల్దార్లు ప్రమీల, రవీంద్రబాబు, ఎంపీడీఓలు బ్రహ్మయ్య, ప్రత్యూషారెడ్డి, ఏపీఓలు శ్రీనివాసులు, శ్యామల, పీఆర్ ఏఈ వాణి, ఎంఈఓ నాగేశ్వరరావు, ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నెమళ్లదిన్నెలో రెవెన్యూ సదస్సు

సీతారామపురం: మండలంలోని నెమళ్లదిన్నె సచివాలయంలో తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును గురువారం నిర్వహించారు. రీసర్వేకు సంబంధించిన సమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. వైస్‌ఎంపీపీ శారమ్మ, సర్పంచ్ రామచంద్ర, వీఆర్వో బాలు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య గణనను పక్కాగా చేపట్టాలి

సీతారామపురం: నైపుణ్య గణన సర్వేను పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ భాస్కర్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్య గణనపై సచివాలయ ఉద్యోగులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 15 నుంచి 59 ఏళ్ల లోపు ఉన్న వారి నైపుణ్యాలను యాప్‌లో విధిగా నమోదు చేయాలని సూచించారు.

నేడు నైపుణ్య గణనపై శిక్షణ

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్య గణనపై శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రావు గురువారం తెలిపారు. సచివాలయ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు తప్పక హాజరుకావాలని కోరారు.

ఇళ్లు కట్టకుండా నగదు స్వాహా చేశారని ఫిర్యాదు

ఉదయగిరి: మండలంలోని గంగిరెడ్డిపల్లిలోని లేఅవుట్‌లో ప్రభుత్వ పక్కాగృహాలు నిర్మించకుండానే కాంట్రాక్టర్ నగదు స్వాహా చేశాడని పలువురు లబ్ధిదారులు ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీకి గురువారం ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొందరికి బేసిమట్టాల వరకు ఇళ్ల నిర్మించగా, మరికొందరి లబ్ధిదారులకు సంబంధించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండానే నగదుస్వాహా చేశాడని ఫిర్యాదు చేశారు. నగదు రికవరీ చేయించి తామే ఇళ్లు సొంతంగా కట్టుకునే అవకాశం కల్పించాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దుత్తలూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు.

మండలాభివృద్ధికి చొరవచూపాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి

ఆత్మకూరురూరల్: మండలాభివృద్ధికి అధికారులు చొరవచూపాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. తొలుత శాఖల వారీగా అధికారులు ప్రగతిని వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్ తమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలకు సర్పంచ్‌లు సహకరించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు నేరుగా ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారని, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటే ఇబ్బందులు తొలగుతాయన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ శరత్ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ఇళ్లను మంజూరు చేస్తోందని, ప్రజలు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఏఓ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి కిషోర్, వైద్యాధికారి దేవానంద్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఖాదర్‌బాషా, అమానుల్లా, ఉపాధి ఏపీఓ శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ నియామకం



కావలి(దగదర్తి): పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ దగదర్తి మండల కమిటీని ఆ అసోసియేషన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్ ప్రకటించారు. దగదర్తి మండల పాస్టర్ల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవాధ్యక్షులుగా జాన్‌పాల్, నల్లాబాయి ఇమ్మానుయేలు, అధ్యక్షులుగా కరుణాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నన్నం సంపత్, ప్రధాన కార్యదర్శిగా రాంబాబు, కోశాధికారిగా ఇమ్మానుయేలు, సహాయ కార్యదర్శిగా యేసుబాబును నియమించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రమేష్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం జాషువ, ఉపాధ్యక్షులు కేఎస్ రాజు, కోశాధికారి ఎస్ ఎనోష్, పాస్టర్స్ ప్రభుకుమార్, సెల్వరాజు, ప్రసాద్, ఇమ్మానుయేలు, సుందరం తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



కావలి: పట్టణంలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో అండర్ – 19 అంతర్ జిల్లా కబడ్డీ పోటీలు గురువారం హోరాహోరీగా సాగాయి. కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కావలి: కావలి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు చేయాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు గురువారం తెలిపారు. బెల్టు దుకాణాలపై 9440902521 నంబర్‌కు సమాచారమిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉదయగిరి జిల్లా సాధనకు ర్యాలీ



ఉదయగిరి: ఉదయగిరి జిల్లా సాధన కోసం పట్టణంలోని రంగనాయకులస్వామి ఆలయం నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు, ప్రజలు కలిసి గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఉదయగిరి జిల్లా సాధన సమితి అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లో వెనుకబడిన 21 మండలాలను కలుపుతూ నూతన జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సాధన సమితి సభ్యులు దస్తగిరి అహ్మద్, షేక్ ఎండీ ఖాజా, గాజులపల్లి రామిరెడ్డి, రామచంద్రమూర్తి, సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్, జీ ఓబుల్‌రెడ్డి, బకీరు జాషువా పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

దుత్తలూరు: కేన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దుత్తలూరు వైద్యాధికారి అయూబ్‌అప్సర్ అన్నారు. దుత్తలూరు, వెంకటంపేట గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది కేన్సర్‌పై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చని చెప్పారు. 30ఏళ్లు పైబడిన వారు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌కే ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

ఉదయగిరి: గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పన ఆధ్వర్యంలో ఉదయగిరిలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది సీహెచ్ వెంకటసుబ్బయ్య, శివకుమారి, బోగ్యం వెంకటేశ్వర్లు, తదితులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యాధికారిణి ఆయేషా ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో రాజశేఖరరాజు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు పీహెచ్‌సీ వైద్యాధికారులు సురేష్ బాబు, మంజుల ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కలిగిరి: స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సీతారామపురం: స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యాధికారిణి స్వప్నారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.


దుత్తలూరు: కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


వరికుంటపాడులో..


సీతారామపురంలో..


కలిగిరిలో..


ఏఎస్‌పేటలో..